epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 32 | శుక్రవారం | 17.05.2024



# జలగామ

- ఒక్క వానకే జలమయమైన పట్టణం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..
- రోడ్లపై పారుతున్న మురుగునీరు

02

General News



# జలగామ..

- ఒక్క వానకే జనగామ జలమయం
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ..
- రోడ్లపై పారుతున్న మురుగునీరు



**జనగామ, మన చౌరాస్తా :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా కుండపోతగా కురిసిన వానతో జనగామ జిల్లా కేంద్రాన్ని వరద నీరు ముంచెత్తింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వరద నీరు రోడ్ల మీద ప్రవహించింది. హనుకొండ - హైదరాబాద్ ప్రధాన రహదారి, బస్టాండ్, అంబేద్కర్ సెంటర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద నీటిలో మురుగంతా రోడ్లపై పారడంతో వ్యాపారస్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఒక్క వానకే పట్టణం పరిస్థితి ఇలా ఉంటే.. మునుముందు వానా కాలంలో ఎలా ఉంటుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని పలువురు కోరుతున్నారు.

### బల్దియాలో కంట్రోల్ రూమ్

**వరంగల్ :** నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి నుంచే కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమిస్తూ కమిషనర్ అశ్విని తానా జీ వాకడే ఉత్తర్వులు జారీ చేశారు. 9701999645, 9701 999676 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

## నేటి నుంచి పట్టభద్రుల ఓటర్ స్లిప్పుల పంపిణీ



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** పట్టుభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి పట్టభద్రుల ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేయనున్నట్టు బచ్చన్నపేట తహసీల్దార్ విశాలాక్షి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బచ్చన్నపేట మండలంలో రెండు పోలింగ్ స్టేషన్లలో మొత్తం 1,995 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. పట్టభద్రుల ఓటర్లకు అందరికీ వారి యొక్క ఓటర్ స్లిప్పులు నేటి నుంచి పిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ వారికి ఓటర్ స్లిప్పు రాకపోతే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.



## ముతపడిన వాటర్ ప్లాంట్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా చిల్పూర్ మండలం కృష్ణాజిగూడెంలో వాటర్ ప్లాంట్ ముతపడి రెండు నెలల గడిచింది. దీంతో గ్రామస్తులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామ కార్యదర్శి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా ఉన్నప్పటికీ వాటర్ ప్లాంట్ నీటికి అలవాటు పడిన జనాలు క్యాన్ వాటర్ కోసం సమీప గ్రామాలైన తాటికొండ, పత్తెపూర్, పల్లగుట్ట వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మూతపడిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## 25లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తిచేయాలి

- కార్యదర్శులు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా:** అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ప్రతి బుధవారం పంచాయతీ కార్యదర్శులు ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించాలన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ తో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, ఈజీఎస్ పనులు, అంగన్వాడీ కేంద్రాలు, విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులపై ఎంపీడీవోలు, ఎంఎన్‌వోలు, ఎంఎస్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 267 పాఠశాలలు ఉండగా 263 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పనులను గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు గుర్తించిన పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న మిగతా పాఠశాలల పనులను వెంటనే గుర్తించి, త్వరగా పూర్తిచేయాలన్నారు. టాయిలెట్స్, తాగునీరు, విద్యుత్తు, గేట్, ప్రహరీ తదితర మౌలిక వసతుల పనులను ఈ నెల 25లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మండల స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి, పూర్తిస్థాయిలో యాక్షన్ ప్లాన్ ను అందించాలని ఎంపీడీవోలకు సూచించారు. విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులను జూన్ 5 లోపు పూర్తి కావాలన్నారు.

### ఉపాధి హామీ పనులపై..

ఉపాధి హామీ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పనులు చేసే వర్కర్లను 200కు పెంచాలని సూచించారు. ఈ క్రమంలో మండల స్పెషల్ అధికారులు కీలకంగా వ్యవహరిస్తారన్నారు. మండలాల వారీగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మండల స్పెషల్ అధికారులు, జడ్పీ సీఈఓ అనిల్ కుమార్, డీఈఓ రాము, డీఏఓ వినోద్ కుమార్, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, ఉద్యాన వన శాఖ అధికారి కేఆర్ లత, డీఎంఓ నరేంద్ర, అన్ని మండలాల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లను స్పీడప్ చేయాలి

**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోళ్లను స్పీడప్ చేయాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఓపీఎంఎస్ లో ఎప్పటికప్పుడు రైతుల ధాన్యం వివరాలను నమోదు చేయాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించరాదని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీఎస్ఓ రోజారాణి, డీఎం సీఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## 'చామల' గెలుపు ఖాయం



**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జింగీటి విద్యనాథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలవడం ఖాయమన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం నిరంతరం కష్టపడి కృషిచేసిన బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బచ్చన్నపేట మండలంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కార్యకర్తలే పార్టీకి బలం అని ఆయన అన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 10 పోలింగ్ స్టేషన్లు

### ఆర్డీవో డి.ఎస్ వెంకన్న

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం స్టేషన్ ఘన్ పూర్ డివిజన్ పరిధిలో 10 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, ఆర్డీవో డి.ఎస్ వెంకన్న తెలిపారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్టేషన్ ఘన్ పూర్ మండలంలో 2,027, చిల్పూర్ 1,144, జఫర్‌గడ్ లో 1,5 12, పాలకుర్తిలో 2,4 95, కొడకండ్లలో 1,305 మంది గ్రాడ్యుయేట్ ఓటర్ల తో కలుపుకొని డివిజన్‌లో 8,543 మంది ఓటర్లు ఉన్నారన్నారు. 27వ తేదీన జరగనున్న పోలింగ్ కోసం స్టేషన్ ఘన్ పూర్ లో 3, చిల్పూర్ లో 1, జఫర్‌గడ్ లో 2, పాలకుర్తిలో 3, కొడకండ్లలో ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున డివిజన్ పరిధిలో సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచారాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బక్కీ అర్జున్ ఉన్నారు.



WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

## ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

### తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్



**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** పార్లమెంటు ఎన్నికలు ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సత్వరం చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర స్టడీ సర్కిల్ కమిటీ సభ్యులు మంగు జయప్రకాశ్ డిమాండ్ చేశారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది ఫిబ్రవరిలో మొదలైన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిలిచిందన్నారు. ఎన్నికలు ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం సత్వరం బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పునః ప్రారంభించాలని కోరారు. మల్టీ జోన్ 2 లోని 13 జిల్లాల పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల గెజిటెడ్ హెడ్మాస్టర్స్ పదోన్నతులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా క్యాడర్ స్ట్రెంత్ కేసు హైకోర్టు కొట్టివేసిన దృష్ట్యా గెజిటెడ్ హెచ్‌ఎంల పదోన్నతులకు టెట్ అవసరం లేదని ఎన్ సి టి ఈ తేల్చి చెప్పిన దృష్ట్యా గతేడాది సెప్టెంబర్ నుంచి నిరవధికంగా నిలిచిపోయిన మల్టీ జోన్ 2 లోని 13 జిల్లాల పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే చేపడితే ఈ మల్టీ జోన్ 2 లో 1000 పాఠశాలలలో ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యి వచ్చే 2024-25 విద్యాసంవత్సరం బోధన పర్యవేక్షణ సజావుగా సాగే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. దీంతో మల్టీ జోన్ 1,మల్టీ జోన్ 2లో నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంట్ తత్సమాన క్యాడర్ పోస్టుల పదోన్నతులు మల్టీ జోన్ 2లో నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంట్ బదిలీల ప్రక్రియకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన ఎస్జీటిల తత్సమాన క్యాడర్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చే లోపుగానే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని పదోన్నతులు, బదిలీల ప్రక్రియ వేసవి సెలవుల్లో చేపడితే వచ్చే విద్యా సంవత్సరం పాఠశాల పని దినాలు వృథా కాకుండా ఉంటుందని అన్నారు.



## ఎమ్మెల్యే కడియం కలిసిన చిల్పూరు నాయకులు

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో చిల్పూరు మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా చిల్పూరు మండల సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్ట పడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# ఉప్పల్ మ్యాచ్ వర్షార్పణం..

## ప్లే ఆఫ్స్‌కి సన్ రైజర్స్

- హైదరాబాద్‌లో ఎడతెరిపి లేని వర్షం
- సన్ రైజర్స్, గుజరాత్ మ్యాచ్ రద్దు
- ఇరు జట్లకు చెరో పాయింట్
- 15 పాయింట్లతో నేరుగా ప్లే ఆఫ్స్‌కి సన్ రైజన్స్
- ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కి చేరిన కోల్‌కతా, బెంగళూరు

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** హైదరాబాద్ లో భారీ వర్షం కారణంగా సన్ రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షార్పణం అయింది. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో కనీసం టాస్ కూడా పడకుండానే మ్యాచ్ ఆగిపోయింది. దీంతో రాత్రి 10.30 గంటల దాకా వేచిచూసిన నిర్వాహకులు ఇక వర్షం తగ్గేలా లేదని భావించి హైదరాబాద్, గుజరాత్ మ్యాచ్ ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో లీగ్ దశలో ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే సన్ రైజర్స్ హైదరాబాద్ 15 పాయింట్లతో నేరుగా ప్లే ఆఫ్స్‌కి చేరుకుంది. అయితే హైదరాబాద్ లో నిన్న మధ్యాహ్నం నుంచే ఎడతెరిపి లేకుండా భారీగా వర్షం కురిసింది. రాత్రి 7.30 కు ప్రారంభం కావాల్సిన మ్యాచ్ రాత్రి 10 గంటల సమయానికి కూడా ప్రారంభం కాలేదు. దీంతో రాత్రి 10:30 గంటల సమయంలో అంపైర్లు మరోసారి గ్రౌండ్ ను పరిశీలించి వర్షం పూర్తిగా తగ్గితే ఇరు జట్లకు కనీసం 5 ఓవర్ల ఆడే సమయం ఉంటే మ్యాచ్ ను నిర్వహించాలనుకున్నారు. అయితే అప్పటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్ ను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక ఇదిలా ఉంటే చెన్నై సూపర్ కింగ్స్ మినహా ఇతర జట్లేవీ 16 పాయింట్లు సాధించే అవకాశం లేకపోవడంతో ప్లే ఆఫ్స్ కి చేరడానికి సన్‌రైజర్స్ మార్గం ఈజీ అయింది. కాగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కి చేరిన విషయం తెలిసిందే.






# 'దేవర ముంగిట నువ్వెంత'

**మన చౌరాస్తా, సినిమా :** బ్లాక్ బస్టర్ మూవీ త్రిబుల్ ఆర్ తర్వాత యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న 'దేవర' పై రోజుకో అప్ డేట్ ఇస్తూ అభిమానుల్లో థ్రిల్లింగ్ పెంచుతున్నారు మూవీ మేకర్స్. అలాగే ఈ మూవీ ప్రముఖ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతుండడంతో జనతా గ్యారేజ్ బ్లక్ బస్టర్ రిపీట్ అవుతుందని అభిమానులు ఈగల్ గా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో అలనాటి అందాల తార శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. జాన్వీ కపూర్ తొలిసారి బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లోకి అడుగుపెడుతుంది. ఈ క్రేజీ మూవీని నందమూరి తారక రామారావు ఆర్ట్స్ , యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై కోసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. అలాగే అనిరుథ్ సంగీతం అందిస్తుండగా.. సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా కనిపించబోతున్నారు. ఇక మూవీ భారీ యాక్షన్, ఫాంటసీ చిత్రం కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అంతా ఆతృతగా ఈ సినిమాకు సంబంధించిన అప్ డేట్ల గురించి తెలుసుకుంటున్నారు. అయితే అలాంటి వాళ్లకోసమే అన్నట్లుగా మూవీ టీం ఓ క్రేజీ న్యూస్ అప్ డేట్ చేసింది. 'దేవర ముంగిట నువ్వెంత' అంటూ నిర్మాత నాగవంశీ ఆసక్తికర ట్వీట్ చేశారు. రజనీకాంత్ 'జైలర్'లోని హిట్ సాంగ్ 'హుకుం' ని మించేలా దేవర సాంగ్ ఉంటుందని మే 19న దేవర ఫస్ట్ సింగిల్ రిలీజ్ కానుందని ఓ పోస్టర్ విడుదల చేశారు. 'మీ అందరి కంటే ముందు నేను పాట విన్నా. నన్ను నమ్మండి. హుకుం పాటను మరిచిపోతారు. సంగీత దర్శకుడు అనిరుధ్ అందించిన ఈ మాస్ పాట నెక్ట్స్ లెవల్ అని పేర్కొన్నారు. 'దేవర ముంగిట నువ్వెంత..' అంటూ ఫైర్ ఎమోజీ జోడించారు. దీన్ని బట్టి ఈ లైన్‌తోనే పాట ప్రారంభం కానుందని అర్థమవుతోంది.ఇక దేవర సినిమాతో ప్రేక్షకుల ముందు వచ్చి అందరినీ ఉర్రూతలూగించేందుకు యంగ్ టైగర్ సిద్ధంగా ఉన్నాడు. ఫియర్ సాంగ్ అప్ డేట్ రావడంతో నందమూరి అభిమానులు ఆ సాంగ్ కోసం ఈగల్ గా ఎదురుచూస్తున్నారు.